క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ జీ. ప్రశాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకట్రావుపల్లి, మల్లాపూర్, మాన్వాడ, కొత్తపేట, నర్సింగాపూర్, కొదురుపాక, వరదవెల్లి, నీలోజిపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీఐకి సన్మానం



సీఐ కృష్ణను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్లు

సిరిసిల్లకల్చరల్: వయోవృద్ధుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని జిల్లాలోని సీనియర్ సిటిజన్లు కోరారు. పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన కె. కృష్ణను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వయో వృద్ధుల హక్కుల పరిరక్షణకు సహకరించాలని కోరారు. అనంతరం సీఐని శాలువాతో సన్మానించారు. సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సీఐ హామీ ఇచ్చినట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చేపూరి బుచ్చయ్య, డాక్టర్ జనపాల శంకరయ్య తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు దొంత దేవదాస్, మిట్టపలి రాములు, నక్క మనోహర్, లక్ష్మీనారాయణ, ఇరుకుల్ల భాస్కర్, లక్ష్మారెడ్డి, మేరుగు కిషన్, ముత్తయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలకేంద్రానికి చెందిన పని అమృతవ్వకు రూ.19,500, గడిపెల్లి గంగవ్వకు రూ.9వేలు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఎంపీటీసీ దేవరకొండ నర్సింహాచారి అందజేశారు. రామన్నపేటలో కట్కూరి స్వామికి రూ.11,500 చెక్కును యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ములిగె నవీన్ అందజేశారు. నాగారంలో లక్ష్మికి రూ.16,500 చెక్కును, జ్యోత్స్నకు రూ.15,500 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో లింభయ్య, ముదాం సత్యం, కస్తూరి రాంరెడ్డి, మ ల్లారెడ్డి, ప్రదీప్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం బొల్లారంకు చెందిన చిత్తారి సాయికృష్ణ ప్రమాదవశాత్తు గాయపడటంతో సీఎం సహాయనిధికి మంజూరు చేసుకోగా మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డీసీసీ సెక్రటరీ బాలసాని శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు బాలసాని దశరథం, సుద్దాల కైలాసం, బుర్ర నారాయణ, రొండి రాజు, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ చిలుక ప్రభాకర్ తదితరులున్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం గ్రామ యువకులు ఎంపీడీవో సత్తయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాలతో పాటు ఉన్నత పాఠశాల వద్ద మిషన్ భగీరథ నీరు, వీధిదీపాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మురుగుకాలువలను రోజు శుభ్రం చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. ఇక్కడ ఎడ్ల సందీప్, చందనం శివరామకృష్ణ, లింగాల నిలేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

గంభీరావుపేట: గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శిగా మండలంలోని దమ్మన్నపేటకు చెందిన ఆకుల మురళీ మోహన్‌గౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నక్క కృష్ణాగౌడ్ చేతుల మీదుగా అందుకున్నారు. గౌడ హక్కుల సాధనకు కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన వారందరికీ మురళీ మోహన్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

గంభీరావుపేట: పోలీసులు పెట్రోలింగ్ సమయంలో హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ అంటూ రైతులను, వ్యవసాయ కూలీలను ఇబ్బంది పెట్టవద్దని బీజేపీ కిసాన్ మోర్చా మండలశాఖ అధ్యక్షుడు కోడె రమేశ్ కోరారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాల వద్దకు వెళ్లి వస్తుంటారని వారిని పోలీసులు మినహాయించి జరిమానాలు విధించవద్దని విజ్ఞప్తిచేశారు.



చినుకు రాలదు.. చింత తీరదు

ఎల్లారెడ్డిపేట: వర్షాలకోసం పత్తిరైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. 15 రోజులుగా వరుణుడు ముఖం చాటేశాడు. ఈ సీజన్‌లో రైతులు తొలకరి జల్లులు కురవగానే దుక్కులు సిద్ధం చేశారు. రెండుసార్లు వర్షాలు పడడంతో పత్తి విత్తనాలు విత్తుకున్నారు. అడపదడపా వర్షాలతో మొదట విత్తిన విత్తనాలు మొలకెత్తకపోగా మళ్లీ విత్తనాలు విత్తారు. విత్తనాలు మొలకెత్తినప్పటికీ తడి లేక వాడిపోతున్నాయి. ఎకరం దున్నకానికి, విత్తనాలకు కలిపి రూ.12వేల వరకు పెట్టుబడి అయిందని, కాగా భారీ వర్షాలు పడటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



రోడ్డుపైనే మురుగు పరుగు

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగో వార్డు కిందివాడలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపైనే పారుతోంది. ఆరు నెలలుగా మురుగునీరు రోడ్డుపై పారుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో పలు వ్యాధులు బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తునఆనరు. వెంటనే మురుగుకాలువలు శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో దర్శనం

జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో సిరిసిల్ల - కామారెడ్డి ప్రధాన రహదారి నుంచి ఇప్పలపల్లి గ్రామానికి వెళ్లేదారిలో నిర్మించిన బస్‌షెల్టర్ అధికారుల నిర్లక్ష్యంతో పిచ్చిమొక్కలతో దర్శనమిస్తూ నిరుపయోగంగా మారింది. కనీసం నిల్చొనే వీల్లేకుండా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం కావడంతో విషపురుగులు సంచరించే అవకాశం ఉంది. అధికారులు చొరవ తీసుకొని బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

మెరిసిన కల్లోలిత ప్రాంత యువకులు

- సిరిసిల్లలో వాలీబాల్, కబడ్డీ పోటీలు
- ప్రతిభ చాటిన గ్రామీణ క్రీడాకారులు
- బహుమతులు ప్రదానం చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం: ఒకప్పుడు ఆ ప్రాంతాల్లో పోలీసుల అంటేనే ఒంట్లో వణుకుపుట్టేది. కల్లోలిత ప్రాంతాల్లోకి ఖాకీలు ఇప్పుడు కలిసిపోతున్నారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ నడుస్తుండగా జిల్లాలోని పోలీసులు యువత సన్మార్గంలో నడిచేలా అవగాహన సదస్సులు, ఉద్యోగాలు కల్పించేందుకు వివిధ కంపెనీలతో కొలువులు సాధించేలా చేయడంతో పాటు మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం కోసం జిల్లాకేంద్రంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో 'దోస్త్‌మీట్'ను నిర్వహించారు. శుక్రవారం జరిగిన కబడ్డీ, వాలీబాల్ జిల్లాస్థాయిలో ఫైనల్స్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్ అంధకారం చేసుకోవద్దన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా జిల్లాలోని యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దోస్త్‌మీట్ - 2024లో భాగంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించి మండలస్థాయిలో గెలుపొందిన జట్లకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

విజేతలుగా నిలిచిన జట్లు

జిల్లాలో పోలీస్‌శాఖ నిర్వహించిన దోస్తీ మీట్‌లో భాగంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లకు శుక్రవారం సిరిసిల్లలోని జూనియర్ కళాశాల మైదానంలో ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్పీ అఖిల్ మహాజన్ వీక్షించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య,డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐలు కిరణ్, మొగిలి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ ఆర్ఐలు మాధుకర్, యాదగిరి, రమేశ్ , ఎస్సైలు సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీలో వేములవాడ రూరల్ టీం విజేతగా నిలవగా రన్నరప్‌గా వీర్నపల్లి, మూడో స్థానంలో రుద్రంగి జట్టు నిలిచింది. వాలీబాల్ పోటీల్లో రుద్రంగి జట్టు విజేతగా నిలవగా రన్నరప్‌గా ఎల్లారెడ్డిపేట (ఆ) జట్టు, మూడో స్థానంలో ఎల్లారెడ్డిపేట (అ) జట్టు నిలిచింది.



వేములవాడ రూరల్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆనందంగా ఉంది



మా ఊళ్లో ఒకప్పుడు పోలీసులు అంటే అందరికీ భయంగా ఉండేది. అడవి ప్రాంతంలో జరిగే విషయాలను పెద్దలు చెప్పడం, ఇప్పుడున్న పోలీసు విధానాలకు చాలా తేడా ఉంది. పోలీసులే క్రీడాపోటీలు నిర్వహించడం మేం విజేతలుగా నిలవడం ఆనందంగా ఉంది.

\- మధు, వాలీబాల్ క్రీడాకారుడు, రుద్రంగి

క్రీడలంటే ఇష్టం



మా ప్రాంతంలో క్రీడలంటే చాలామందికి ఇష్టం ఉంటుంది. పోటీల్లో పాల్గొని విజయం సాధించడం ఆనందంగా ఉంది. ఇలాంటి పోటీల ద్వారా మరికొందరు క్రీడల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతారు.

\- ఎస్. శ్రవణ్, కబడ్డీ క్రీడాకారుడు, చెక్కపల్లి వేములవాడ రూరల్

ఇలాగే కొనసాగించాలి



జాతీయ, రాష్ట్రస్థాయి ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నా. పోలీసులు క్రీడాపోటీల్లో పాల్గొనేలా ప్రోత్సాహం కల్పిస్తున్నారు. దీనిలో సాధించిన విజయం మరింత ఆనందాన్ని ఇచ్చింది. ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం ఇలాగే కొనసాగించాలి.

\- టి. సుధీర్, కబడ్డీ క్రీడాకారుడు, రంగంపేట

ఉన్నతలక్ష్యం వైపు తీసుకెళ్లేలా..



శివారు ప్రాంతాల్లోని యువకులను ఉన్నత లక్ష్యం వైపు తీసుకెళ్లేందుకు ప్రోత్సహిస్తున్నాం. గెలుపోటములను సమానంగా తీసుకునే తీరును అలవర్చుకునేందుకు క్రీడాపోటీలు నిర్వహించాం. జిల్లాలో మంచి విద్య, క్రీడానైపుణ్యం ఉన్న యువత ఉంది.

\- అఖిల్ మహాజన్, ఎస్పీ,

వీర్నపల్లి ఎస్సైగా ఎల్లా గౌడ్



వీర్నపల్లి: వీర్నపల్లి ఎస్సైగా వేములవాడ టౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎల్లాగౌడ్‌ను నియమించారు. ఇప్పటి వరకు వీర్నపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన జిల్లెల రమేశ్‌ను వేములవాడ టౌన్ ఎస్సైగా బదిలీపై వెళ్లారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కువ రోజులపాటు నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. చిన్నలింగాపూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నీరజ మాట్లాడుతూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



వేములవాడఅర్బన్: వేములవాడలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



తంగళ్లపల్లిలో మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుదేశ్ కుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని ఎదురుగట్ల గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ శాఖ, గ్రామ గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, కులస్తులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో జోగం రాజు, ఈజీఎస్ ఏపీవో రాజనర్సు, ఐకేపీ ఏపీవో పర్శరాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

గంభీరావుపేట: మండలానికి 103 కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయ్యాయి. మండలకేంద్రంలో లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిల చేతుల మీదుగా అందించనున్నారు. తహసీల్దార్ భూపతి, ఆర్ఐ శ్రావణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ శుక్రవారం ఏర్పాట్లు పరిశీలించారు.

వీర్నపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 34 మంది లబ్ధిదారులుకు శనివారం కల్యాణలక్ష్మి చెక్కులు పపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని లక్ష్మి-మల్లారెడ్డి కన్వెన్షన్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతులమీదుగా చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

కనగర్తిలో నెమలి మృతి



కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో ఓ జాతీయపక్షి మృతిచెందింది. గ్రామ శివారులోని బూర్గు చెరువుకు వెళ్లే కాలువలో తిరుగుతున్న నెమలిని గుర్తు తెలియని జంతువు దాడి చేసింది. దీంతో రైతులు జంతువును తరిమికొట్టారు. గ్రామంలో బూర్గుచెరువు, చిన్నబోరు ప్రాంతంలో నెమళ్ల అధికంగా సంచరిస్తుండడంతో కొన్ని రోజులుగా వాటి వధ జరుగుతున్నట్లు తెలిసింది.

బురదమయంగా మండల పరిషత్ ఆవరణ



చందుర్తి : వానాకాలం వ్యాధులు ప్రబలే కాలమంటూ గ్రామ గ్రామాన ప్రచారం చేపట్టే మండల పరిషత్ అధికారులు తమ కార్యాలయం ఆవరణలో పారిశుధ్యం లోపించినా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. చందుర్తి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీపై వర్షపు నీరు చేరి మురికికూపంగా మారింది. సీసీ అంతా మట్టితో నిండి బురదమయంగా మారింది. కనీసం మట్టిని తొలగించినా సమస్యకు పరిష్కారం లభిస్తుందని, అధికారులు ఇతరులకు నీతులను వల్లించడం కాదని, ఆచరణలో చూపించాలని వాపోతున్నారు.

లారీ బోల్తా..



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి కల్వర్టు వద్ద ప్రమాదవశాత్తు లారీ బోల్తా పడి సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. కోరుట్ల నుంచి వేములవాడకు ధాన్యం లోడుతో వస్తున్న లారీ మర్రిపల్లి-కోరుట్ల ప్రధాన రహదారిపై అదుపుతప్పి బోల్తాపడింది. ఆ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న గ్రానైట్ లారీ

బోయినపల్లి: కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిలో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఓ గ్రానెట్ లారీ ఢీ కొన్న సంఘటన మండలంలోని కొదురుపాక చౌరస్తా వద్ద శుక్రవారం జరిగింది. కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేములవాడ వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తోంది. కొదురుపాక రాండు బోర్డు పరిసరాల్లో బస్సు ఆగడంతో ప్రయాణికులు దిగుతున్నారు. అదే సమయంలో బోయినపల్లి నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ గ్రానెట్ లారీ బస్‌ను క్రాస్ చేస్తుండగా, ఆర్టీసీ బస్సును వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.



వరుణా.. చూపించు కరుణ



కోనరావుపేట: వర్షాకాలం ప్రారంభమై నెలన్నర రోజులు గడుస్తున్నా వర్షాలు కురవకపోవడంతో వరుణుడు కరుణించాలని కోరుతూ కనగర్తిలో హమాలీ సంఘం ఆధ్వర్యంలో గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని పోచమ్మ, హనుమాన్, రాజరాజేశ్వరస్వామి, బ్రహ్మంగారి ఆలయాల్లో జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అనుమానితుల వివరాలపై పోలీసుల ఆరా

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో శుక్రవారం మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో స్థానికులు ఈ విషయాన్ని సోషల్‌మీడియాలో పోస్ట్‌చేశారు. ఈ విషయం మండలకేంద్రంలో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న పోలీసులు అనుమానితులు స్థానిక కేసీఆర్ కాలనీలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సముదాయం సమీపంలో ఉండగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో ఇద్దరు అనుమానితుల వేలిముద్రలను సేకరించి, వారి వివరాలపై ఆరా తీశారు. వారు మహారాష్ట్ర నుంచి వచ్చి ఇక్కడ మసాలాలు అమ్ముతున్నట్లు తేలడంతో వారి గుర్తింపుకార్డులను సేకరించి వదిలివేశారు. పొద్దంతా దొంగలుగా ప్రచారమైన విషయం ఫేక్ అని తేలడంతో మండలకేంద్ర ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

ప్రత్యేక పూజలు

రుద్రంగి: మొహర్రం వేడుకల సందర్భంగా మండలకేంద్రంలో పీరీల వద్ద పలువురు మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.